క్లుప్తంగా

న్యాయవాదులు విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో న్యాయవాది రాజగోపాలరెడ్డిపై మర్రిపాడు ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి దాడి చేయటాన్ని నిరశిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో గురువారం విధులు బహిష్కరించారు. పట్టణంలోని తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం ముందు న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం పటిష్టమైన చట్టాన్ని రూపొందించాలన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసబాబు, రాజవరపు నరసింహరావు, చవల బాలకోటయ్య తదితరులు ఉన్నారు.

ఏఎంసీ సభ్యురాలు వరలక్ష్మి రాజీనామా



సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యురాలు బచ్చు వరలక్ష్మి తన పదవికి రాజీనామా చేసింది. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఇస్మాయిల్‌కు రాజీనామా పత్రాన్ని అందించింది. అనివార్య కారణాల వలన మార్కెట్ కమిటీ సభ్యురాలు పదవికి రాజీనామాను సమర్పిస్తున్నట్లు ఆమె లేఖలో పేర్కొంది. ఆమెతో పాటు భర్త, మాజీ కౌన్సిలర్ బచ్చు మనోహర్ ఉన్నారు.

పలుదేవర్లపాడులో 'ఫ్యామిలీ డాక్టర్'

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి పాల్గొని అవసరమైన వైద్యసేవలందించి, మందులను అందించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలందించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన టీకాలు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సరస్వతి శిశుమందిర్‌లో కెరీర్ గైడెన్స్

సత్తెనపల్లి: పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శకత్వం కోసం ఆర్యవైశ్య సేవాదళ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం శనివారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని ఆర్యవైశ్య సేవాదళ్ అధ్యక్షుడు చలువాది హరికుమార్ గురువారం తెలిపారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల మణికుమార్ ఉన్నారు.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో భారత ఉప ప్రధాని, స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం జరుగుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ గురువారం తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా అమ్మవార్ల ప్రతిష్టా వేడుకలు



శావల్యాపురం: గుర్రంవారిపాలెంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ, పేరంటాళ్లమ్మ అమ్మవార్ల దేవాలయాల ప్రతిష్టా వేడుకలు గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గుంటూరు శేషాచార్యులు సారథ్యంలో నూతన దేవాలయాలు ప్రతిష్టా వేడుకలు వైభవంగా చేపట్టారు. అనంతరం మూల విరాట్‌లను పూలదండలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు దావులూరి సంపూర్ణ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ప్రతి గడపలోనూ సంతోషం

సత్తెనపల్లి 3, 30 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన అంబటి సతీమణి



పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నుంచి ప్రచారం ప్రారంభిస్తున్న అంబటి విజయలక్ష్మి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి పార్టీ శ్రేణులతో కలిసి గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలోని 3, 30 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి విజయలక్ష్మి ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి అందిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ఏ పథకాలు ఎంత లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. రెండు అంశాల్లో మీకు ఏ ప్రభుత్వం మంచిదనిపించింది అంటూ సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గడపలో సంతోషం నెలకొందన్నారు. 60 ఏళ్లు దాటిన అవ్వా, తాతలు, మంచంలోనే ఉండిపోయిన వృద్ధులు, మానసిక సమస్యలతో బాధపడేవారు, దివ్యాంగులు, శారీరక సమస్యలతో పెన్షన్ పొందేవారు ఇలా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం వలంటీర్లను పెన్షన్ పంపిణీ చేయొద్దని చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు మరింత ఇబ్బంది పడుతున్నారన్నారు. కులం, మతం సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. రానున్న ఎన్నికల్లో సత్తెనపల్లి శాసనసభ్యుడిగా పోటీ చేస్తున్న అంబటి రాంబాబుకు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని తద్వారా మళ్ళీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఉపేష్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, 30వ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంగుల జయలక్ష్మి, బండి రాజ్యలక్ష్మి, లోక కల్యాణి, రాయిడి విజయ, కొణతం స్వాతి, గంగారపు అనూష, మహిళలు, పార్టీ శ్రేణులు, ఆయా వార్డుల ప్రజలు, తదితరులు ఉన్నారు.

జగనన్న ఇచ్చిన ధైర్యంతోనే ఓట్లడుగుతున్నాం

- గెలుపు మాదే.. మెజార్టీపైనే దృష్టి
- వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంత కుమారి
- పొడపాడు, ముస్సాపురంలలో ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో నంబూరు వసంతకుమారి

పెదకూరపాడు: గెలుపు తమదేనని ఎప్పుడో నిర్ణయమైందని ప్రస్తుత పోరాటం మెజార్టీ పెంచటం కోసమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నంబూరు వసంతకుమారి అన్నారు. గురువారం మండల పరిధిలోని పొడపాడు, ముస్సాపురం గ్రామాలలో వసంత కుమారి పర్యటించారు. ఆమెకు ఆయా గ్రామాల మహిళలు హారతులపట్టి ఘనస్వాగతం పలికారు. నంబూరు వసంతకుమారి మాట్లాడుతూ మీకు మంచి చేశాం కాబట్టే ఓటు అడగటానికి వచ్చామన్నారు.పేదల కష్టాలు తీరాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న నిరంతరం పనిచేస్తున్నారన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నదేనన్నారు. రాష్ట్రానికి మంచిచేసిన జగనన్నకు, నియోజవర్గానికి మంచిచేసిన శంకరరావు అండగా నిలిచి ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేయాలని కోరారు. జగనన్న జనరంజక పాలనకు ఆకర్షితులై ప్రతిరోజు వందలాదిమంది పార్టీలో చేరటమే నిదర్శనమన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి చెందిన బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అరుద్ర వీరబాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. అదే విధంగా మండంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన కోవూరి శ్రీనివాసరావు సొంతగూటికి చేరాడు. ప్రలోభాలకు గురి చేసి, మోసపూరిత మాటలు చెప్పి తనను భాష్యం ప్రవీణ్ దగ్గరకు బుధవారం తీసుకువెళ్లి టీడీపీ కండువా వేశారని శ్రీనివాసరావు తెలిపారు. తప్పు తెలుసుకుని తిరిగి గురువారం ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. నాయకులు మేకల సోమయ్య, వెంకటేశ్వర్లు, గాదె మిల్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ, జనసేనల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. గురువారం పెదకూరపాడు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీ యువ నాయకుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి సమక్షంలో పార్టీ చేరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరినవారిలో నరుకుల్లపాడు మాబు, ఆలూరి రాజేష్, సాదినేని శివ, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఉన్న భక్తవీరాంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయని ఆలయ ధర్మకర్త జాగర్లమూడి రామ్ గోపాల్‌శర్మ తెలిపారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య విశేష పూజలు బ్రహ్మశ్రీ వడ్లమాని యజ్ఞేశ్వరరావు సారథ్యంలో దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

9న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



అమ్మవారి మూలవిరాట్



అడవి పేరంటాళ్లమ్మ దేవాలయం


శావల్యాపురం: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు గ్రామం బొందిలిపాలెంలో అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల వేడుకలు ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్నాయి. ఆలయ స్థల పురాణం మేరకు.. పేరయ్య, పేరమ్మ దంపతులు ఆవులను అడవిలో మేపుతుండగా..హఠాత్తుగా ఒక పులి పేరయ్యపై దాడి చేసి, చంపేసింది. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య పేరమ్మ చితి మంటల్లో దూకింది. అనంతరం ఈ దంపతులు అడవిలో శిలా రూపాల్లో వెలిశారు. పేరయ్య, పేరమ్మను అడవి పేరంటాళ్లమ్మగా పూజిస్తూ.. నాపరాళ్లతో దేవాలయం కట్టి, సుమారు రెండు వందల ఏళ్ల నుంచి భక్తులు పూజలు చేస్తున్నారు. బొందిలిపాలెం గ్రామానికి చెందిన పాపసాని పెంటయ్య, మరొకరు ఆలయ అభివృద్ధికి ఐదు ఎకరాల పొలం విరాళమిచ్చారు. అప్పటి నుంచి ఉగాది పర్వదినం ఏటా తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. అమ్మవారి విశిష్టత నలుమూలలకు విస్తరించింది. ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి చేరింది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏటా తిరునాళ్ల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పది రోజుల నుంచి భక్తులతో అమ్మవారి దేవాలయంలో సందడి నెలకొంది. తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

శంకర మఠంలో వేద సభ



నరసరావుపేట ఈస్ట్: శ్రీ శృంగేరి శంకర మఠంలో గురువారం తంగిరాల వెంకటేశ్వర్లు అవధాని స్మారక వేద సభ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు వేద పఠనం గావించారు. కార్యక్రమంలో తిరుపతి వేదపాఠశాల ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రమణ్యం, కుప్పా గోపాలకృష్ణ సోమయాజీ, సంచాలకులు తంగిరాల దక్షిణామూర్తి, తంగిరాల శివకుమార్‌శర్మ, శంకరమఠం మేనేజర్ కేవీకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం



మాచర్లరూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచారి, గిరిశర్మ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని భక్తులకు వివరించారు. ఆలయ ధర్మకర్త అల్లం కోటిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రావణి దంపతులు స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారిని ప్రత్యేక వాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడులు



నరసరావుపేట టౌన్: నాటు సారా తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి, 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. నకరికల్లు మండలం చేజర్ల శివారు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఘటనా స్థలంలో సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తునట్లు సీఐ తెలిపారు.

చక్కగా చదువుకుని గొప్పగా రాణించాలి



విద్యార్థులతో నడికట్టు రామిరెడ్డి, ఉపాధ్యాయులు

నాదెండ్ల: ఎందరో ప్రముఖులకు విద్యనేర్పిన పాఠశాలలో విద్యార్థులు గొప్పగా చదివి.. రాణించాలని గోల్కొండ హోటల్స్ అధినేత, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి పేర్కొన్నారు. చిరుమామిళ్ళలో కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఐదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. తాను ఒకప్పుడు చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ప్రస్తుతం చక్కగా చదువుకునేందుకు ప్రభుత్వం, దాతలు సహకరిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కాట్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో ప్రస్తుతం 183 మంది విద్యార్థులు చదువుతున్నారని, గడిచిన నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్కూలు ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు- స్కూటీ ఢీ : వ్యక్తి మృతి



నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రహదారిపై సాతులూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఒడిషా బాల చిన్నారావు (58)కొవ్వొత్తులు అమ్ముకుని జీవిస్తుంటాడు. ఎప్పటిలానే ఫిరంగిపురం నుంచి తన స్కూటీపై నరసరావుపేటకు బయలుదేరాడు. ఇదే సమయంలో నరసరావుపేట ఆర్టీసీ డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు గుంటూరు వైపు వెళ్తోంది. సాతులూరు సబ్ స్టేషన్ వద్దకు రాగానే ఎదురెదురుగా బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. దీంతో బస్సు చక్రాలకింద పడి బాలచిన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. వివరాలు నమోదు చేసుకుని, కేసు నమోదు చేశారు.

టీడీపీ కుట్రతో వృద్ధులకు ఇక్కట్లు



ధూళ్లిపాళ్లలో పింఛన్ల కోసం సచివాలయంలో వేచిచూస్తున్న అవ్వా,తాతలు



మాదలలో పెన్షన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ పి.సింగారావు

మాలాంటి వారికి పింఛనే ఆధారం..



మాది గుండ్లపల్లి గ్రామం, ప్రతి నెలా దివ్యాంగ పింఛన్ వస్తుంది. ఒకటోతేదీ పొద్దునే ప్రతినెలా క్రమం తప్పకుండా పింఛన్ ఇచ్చేవారు. ఈ నెల మాత్రం ఆలస్యమైంది. పింఛన్ చేతికి రాలేదు. ఎందుకో తెలుసుకుంటే వలంటీర్ ఇళ్లకొచ్చి పింఛన్ ఇవ్వొద్దని, ఆపారని తెలిసింది. పనిచేయడం చేతకాని మాలాంటి వారికి పింఛనే ఆధారం.. ఇలాంటివి జరిగితే మేమేం కావాలి.

– దూదేకుల దర్గావలి, గుండ్లపల్లి, వికలాంగ పింఛన్‌దారుడు

సత్తెనపల్లి,నకరికల్లు: టీడీపీ, చంద్రబాబు కుట్రతో పింఛన్లు అందుకోవడానికి అవ్వా, తాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాటి చంద్రబాబు పాలన రోజులు మళ్లీ వచ్చాయంటూ లబ్ధిదారులు వాపోయారు. వలంటీర్లను పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడంతో పింఛన్ల కోసం సచివాలయాలకు వద్దకు వచ్చిన లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. జగన్ బాబు మాకు గుమ్మం వద్దకే పింఛన్ పంపారని, చంద్రబాబు కుట్రపూరితంగా వ్యవహరించడంతో మాకు తిప్పలు తప్పడం లేదంటూ వాపోయారు.

పెన్షన్ల పంపిణీ పరిశీలన

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామ సచివాలయంలో జరుగుతున్న పెన్షన్ పంపిణీ తీరును తహసీల్దార్ పి.సింగారావు గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర పంపిణీ జరిగిందో పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వద్దకే వెళ్లి పింఛను అందించాలని సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. పంపిణీ కేంద్రం వద్ద తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



సత్తెనపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలను చూపుతున్న ధూళ్లిపాళ్ల వలంటీర్లు

ధూళ్లిపాళ్లకు చెందిన 19 మంది రాజీనామా

సత్తెనపల్లి: మండలంలోని ధూళ్లిపాళ్ల గ్రామానికి చెందిన 19 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జగదీష్‌ను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. అవ్వా, తాతలకు పెన్షన్ తో పాటు ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సేవా దృక్పథంతో పని చేశామన్నారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన దుర్బుద్ధిని ప్రదర్శించారన్నారు. టీడీపీ కూటమి వ్యవహార శైలికి మనస్థాపం చెంది స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నామన్నారు.

పాపాయపాలెంలో 10 మంది...



పాపాయపాలెంలో ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన 10 మంది గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. గ్రామ స్వరాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచేందుకు తాము స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామానికి చెందిన వలంటీర్లు మర్రి అనంతరెడ్డి, రామచంద్రారెడ్డి, బత్తుల భూపతి, రామారావు, సతీష్, తురకా నాంచారయ్య, మాధవి, ప్రమీల, చంద్రయ్య, జ్యోతి, లక్ష్మీనారాయణలు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ వెంకటరెడ్డికి అందజేశారు.

ప్రారంభమైన ఉచిత కుట్టు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మామిళ్లపల్లి విజయలక్ష్మి

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెంలోని శ్రీవేంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో పరి ఫౌండేషన్, అమెరికా వారి సౌజన్యంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ నిర్వహణలో గురువారం ఉచిత కుట్టు శిక్షణా తరగతులను నోబుల్ వరల్డ్ రికార్డు గ్రహీత మామిళ్లపల్లి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు ఉపాధి పొందేందుకు ఇదే చక్కటి అవకాశమని, ఇలాంటి అవకాశాలను మహిళలు జారవిడుచుకోవద్దని సూచించారు. చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు తుమ్మా శౌరెడ్డి మాట్లాడుతూ చెరుకుంపాలెం, చింతపల్లి, కొత్తపల్లి, పుట్లగూడెం, తాడువాయి గ్రామాలకు చెందిన నిరుపేద మహిళలకు ఈ శిబిరం ద్వారా 50 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 50 రోజుల తరువాత శిక్షణ పొందినవారందరికీ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు 150మంది మహిళలు శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. స్నేహ హస్తాలు కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, మన్నెం భద్రయ్య, రామోజీ సాంబశివరావు, గొటిక సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై టీడీపీ నేతల దాడి దుర్మార్గం

బాధితుడిని పరామర్శించిన బీసీ సంఘ నాయకులు



గణపవరంలో అశోక్‌బాబును పరామర్శిస్తున్న బీసీ సంఘ నాయకులు

నాదెండ్ల: దివ్యాంగుడు, బీసీ కులానికి చెందిన యువకుడిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయటం దుర్మార్గమని, నిందితులపై పోలీసులు చట్టపర చర్యలు తీసుకోవాలని బీసీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గణపవరం శాంతినగర్‌లో నివాసం ఉండే దివ్యాంగుడు జవ్వాది అశోక్‌బాబుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం విదితమే. బాధితుడిని పరామర్శించిన బీసీ నాయకులు, అనంతరం మాట్లాడారు. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీని టీడీపీ నాయకులు అడ్డుకోవటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సోషల్ మీడియాలో అశోక్‌బాబు అభిప్రాయం వ్యక్తం చయడం తప్పా అని ప్రశ్నించారు. ఇంతమాత్రానికే టీడీపీ నాయకులు మద్యం సేవించి, కనీసం దివ్యాంగుడని కూడా చూడకుండా మారణాయుధాలతో అశోక్‌బాబుపై దాడికి యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆలా శివకోటియాదవ్ పాల్గొన్నారు.